# మళ్లీ వీఆర్వో వ్యవస్థ!

మొదటిపేజీ తరువాయి...


ఇచ్చినోళ్లకే పనయ్యేది. పేద రైతులు పదులసార్లు ప్రదక్షిణలు చేసినా పట్టించుకోని పరిస్థితి. రైతులకు ఈ దుస్థితిని దూరం చేసేందుకు 2020లో నాటి కేసీఆర్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. గ్రామ రెవెన్యూ అధికారులను ఇతర ప్రభుత్వ శాఖల్లోకి సర్దుబాటు చేసింది. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. ఆ నాటి నుంచి రైతులపై, భూములపై వీఆర్వోల అజమాయిషీ లేదు. కంప్యూటర్‌లో ఒక్కసారి భూమి వివరాలు నమోదైతే మార్చే ప్రసక్తే లేదు. ఫలితంగా రైతుల్లో భరోసా పెరిగింది. కానీ.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ వీఆర్వో వ్యవస్థను తెరమీదకి తెచ్చింది. భూభారతి చట్టం ద్వారా ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమించనున్నది. పాత వీఆర్వోలు, వీఆర్ఏలనే మళ్లీ రెవెన్యూ శాఖకు తీసుకొచ్చి వీఆర్వోలుగా నియమిస్తామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. మళ్లీ రాత్రికి రాత్రే తమ తలరాతలు ఎక్కడ మారిపోతాయో అని భయపడుతున్నారు.

### రాత్రికి రాత్రే రికార్డులు తారుమారు

గతంలో మ్యానువల్ పద్ధతిలో భూ రికార్డుల నిర్వహణ జరిగినప్పుడు వీఆర్వో రాసిందే రాత.. గీసిందే గీత అన్నట్టుగా సాగేది. లంచం ఇచ్చినవాళ్లకు, పైరవీలు చేసుకున్నవాళ్లకు రికార్డుల్లో కాస్తు కాలమ్‌లో పేర్లు నమోదయ్యేవి. ఆ తర్వాత వారినే యజమానులుగా మార్చి పట్టాలు మంజూరు చేసేవారు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు 1995లో తండ్రి నుంచి వారసత్వంగా చెరో 2.03 ఎకరాల భూమి వచ్చింది. 2000 సంవత్సరంలో తమ్ముడి భూమిని అన్న కొనుగోలు చేశాడు. రికార్డుల్లో పేరు మార్చాలని వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు రూ.5 వేలు లంచం డిమాండ్ చేయగా.. ఆ రైతు ఇవ్వలేదు. 2018లో భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత ఆ రైతు పేరుమీద 4.06 ఎకరాలకు బదులు 0.3 గుంటల భూమి మాత్రమే ఉన్నది. దీంతో ఆ రైతు లబోదిబోమన్నాడు. లంచం అడిగితే ఇవ్వలేదని వీఆర్వో తన భూమిని వేరే వ్యక్తుల పేర్లమీదికి మార్చాడని ఆరోపించారు. 'పొరబాటున ఆ భూమి వేరే రైతు పేరుమీదికి మారింది' అంటూ ఆ వీఆర్వో చావుకబురు చల్లగా చెప్పాడు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. ఏదైనా అత్యవసరమై రైతులు తమ భూమిని అమ్ముకోవాలని చూసినప్పుడు రికార్డులు తారుమారైన ఘటనలు వెలుగులోకి వచ్చేవి. దీంతో మళ్లీ అదే వీఆర్వోకు అడిగినంత ముట్టజెప్పి, పై అధికారుల కాళ్లావేళ్లా పడి అడిగినంత సమర్పించుకొని పట్టా మార్పించుకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా రికార్డులు మారకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు ప్రయత్నించిన ఉదంతాలు కూడా ఉన్నాయి. పట్టా భూములే కాకుండా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కావడంలో వీఆర్వోలు కీలక పాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. రైతులు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులు అన్ని వర్గాల భూ యజమానులు వీఆర్వోల బాధితులే.

### మళ్లీ పాత వీఆర్వోలకు పిలుపు

కాంగ్రెస్ ప్రభుత్వం 2020 ఆర్వోఆర్ చట్టాన్ని రద్దు చేసి, కొత్తగా భూభారతి బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసిన విషయం తెలిసిందే. దీని ప్రకారం ప్రతి గ్రామానికి ఒక వీఆర్వోను నియమించనున్నారు. వీరికి మళ్లీ భూ రికార్డుల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. అందుకోసం కొత్త నియామకాలు చేపట్టకుండా పాత వీఆర్వోలు, వీఆర్ఏలనే నియమిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఇప్పటికే ఆప్షన్లు కూడా తీసుకుంటున్నారు. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. తమ భూములపై మళ్లీ వీఆర్వోల పెత్తనం మొదలవుతుందని, పాత రోజులు మళ్లీ వస్తాయని బిక్కుబిక్కు మంటున్నారు.




## విచ్చలవిడి అవినీతికి కేరాఫ్

వీఆర్వో వ్యవస్థ గతంలో విచ్చలవిడి అవినీతికి కేరాఫ్‌గా ఉండేది. డబ్బులు ఇస్తేనే పెన్ను ముట్టే పరిస్థితి. క్రయవిక్రయాలు నమోదు కావాలన్నా, 1బీ కావాలన్నా, పాస్‌బుక్ రావాలన్నా.. ఇలా ఏ పని అయినా లంచం ఇవ్వాల్సిందే. ఏ పనికి ఎంత అన్నది ఫిక్స్ చేసేవారు. 'పాస్‌బుక్ ఇవ్వాలంటే ఒక్కో రైతు రూ.లక్ష ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేస్తున్నాడు' అంటూ 2019లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నెర్రవల్లి రైతులు తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని ఓ వీఆర్వో కొత్త పాస్‌బుక్‌లు, పట్టామార్పిడి కోసం రైతుల నుంచి భారీగా వసూళ్లు చేశాడు. ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత దాదాపు 10 నెలలపాటు పత్తాలేకుండా పోయాడు. దీనిపై బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలాంటివి ప్రతి రైతుకు ఒక అనుభవమే. ఒకప్పుడు ఏసీబీ నమోదు చేసిన కేసుల్లో రెవెన్యూ శాఖ టాప్‌లో ఉండగా, పట్టుబడినవారిలో ఉన్నతాధికారులతో సమానంగా వీఆర్వోలు ఉండేవారు. వారి వద్ద రూ.కోట్లలో అక్రమాస్తులు బయటపడేవి.

## రద్దుతో సంబరం

వీఆర్వో వ్యవస్థ చేస్తున్న దారుణాలను గమనించిన కేసీఆర్ ప్రభుత్వం 2020లో సాహసోపేత నిర్ణయం తీసుకున్నది. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు సంబరాలు చేసుకున్నారు. తమ భూములపై ఇతర వ్యక్తుల పెత్తనం పోయిందని ఆనందపడ్డారు. 2020లో తెచ్చిన కొత్త రెవెన్యూ చట్టంతో రికార్డులు కంప్యూటర్‌లోకి వెళ్లాయి. భూ క్రయవిక్రయాలన్నీ ఆన్‌లైన్‌లోనే సాగాయి. రికార్డులు సరళతరం అయ్యాయి. దీంతో గ్రామాల్లో భూ రికార్డుల నిర్వహణ అవసరం లేకుండా పోయింది. వీఆర్వోలకు పనిలేకుండా పోయింది. అందుకే ఆ వ్యవస్థను రద్దు చేశామని నాటి సీఎం కేసీఆర్ చెప్పారు.

## సర్వేయర్లుగా వీఆర్వోలను నియమిస్తారా?


- అవగాహన లేనివారిని నియమిస్తే సమస్యలు
- ప్రభుత్వం పునరాలోచించాలని సర్వేయర్ల డిమాండ్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 27: అవగాహన లేని వారిని సర్వేయర్లుగా నియమిస్తే ఊరుకునేది లేదని, ఆందోళనలు చేస్తామని ప్రభుత్వ సర్వేయర్లు హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లాలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న సర్వేయర్లు శుక్రవారం జిల్లా కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూమాత అమలుపై, సర్వేఅండ్ ల్యాం డ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో నూతనంగా చేపట్టనున్న నియామకాలపైనా చర్చ జరిగింది. తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ.. సర్వేయర్లను నియమిస్తామన్న ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. గతంలో పనిచేసిన వీఆర్వోలకు అవకాశం కల్పిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించడంపై అభ్యంతరం తెలిపారు. ఎలాంటి టెక్నికల్ నాలెడ్జ్ లేని వా రిని నియమిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. ప్రభుత్వం భూసమస్యలు లేకుండా చేస్తానని చెబుతూనే, కొత్త సమస్యలు సృష్టించడం సరికాదని చెప్పారు. కర్ణాటకలో చేపట్టిన విధానాన్ని ఇక్కడా అమలు చేస్తామనడం సరికాదన్నారు.

## పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు లేదు

**ఎన్ఎస్‌యూఐ నేత నిరంజన్‌బాబా**

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి సముచిత స్థానం లేదని ఎండీ నిరంజన్ బాబా శుక్రవారం తీవ్ర మనస్తాపంతో మీడియా ముందు ఆవేదన వెలిబుచ్చారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తగా, జిల్లా , యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా .. పార్టీ అభివృద్ధి కోసం 18 ఏండ్లుగా పని చేసినా ఎలాంటి పదవి లభించలేదని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పార్టీ పదవులకు అర్హులం కాదా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పనిచేయని నాయకులకు పదవులు వస్తున్నాయని, ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. వనపర్తి కోర్టులో న్యాయవాదిగా చాలాకాలంగా పనిచేస్తున్నా.. కోర్టులో అదనపు గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏజీపీ) పదవి ఆశించినా తనకు దక్కకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్టు చెప్పారు.



నాగర్‌కర్నూల్ జిల్లా నేరళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి,

## మర్రిని పరామర్శించిన సంతోష్

- జంగిరెడ్డి చిత్రపటం వద్ద మాజీ ఎంపీ నివాళి

తిమ్మాజిపేట, డిసెంబర్ 27 : తండ్రిని కోల్పోయిన నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పరామర్శించారు. శుక్రవారం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వెళ్లిన ఆయన మర్రి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ మలోతు కవిత మర్రిని పరామర్శించారు.

## వీఆర్వోలు, వీఆర్ఏలు నాట్ విల్లింగ్!

- వెనక్కి వచ్చేందుకు నేటితో ముగియనున్న గడువు
- సర్వీస్ రూల్స్ లేకపోవడంతో తర్జన భర్జన

హైదరాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): గ్రామాల్లో కొత్తగా వీఆర్వోలుగా పని చేసేందుకు పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదని రెవెన్యూవర్గాలు చెప్తున్నాయి. ఇతర శాఖల్లో పనిచేస్తున్న పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు తిరిగి వచ్చేందుకు విల్లింగ్ ఇవ్వాలని సీసీఎల్ఏ ఇటీవల ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ గడువు శనివారంతో ముగియనున్నది. రాష్ట్రవ్యాప్తంగా 10,434 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామానికి ఒక వీఆర్వోను నియమించాలని, మరో వెయ్యి మందిని సర్వేయర్లుగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 11,500 మందిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తేవాలని భావించింది. గతంలో ఇతర శాఖల్లోకి సర్దుబాటు అయిన వీఆర్వోలు, వీఆర్ఏలు కలిపి దాదాపు 24 వేల మంది వరకు ఉన్నారు. దీంతో కుప్పలుతెప్పలుగా దరఖాస్తులొస్తాయని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వం అంచనాలను తలకిందులు చేస్తూ ఇప్పటివరకు 3,500 మంది వరకు మాత్రమే విల్లింగ్ ఇచ్చినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. నూతన వీఆర్వో వ్యవస్థకు సంబంధించి సర్వీస్ రూల్స్ నిర్ధారణ కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్తున్నారు. 'ముందు చేరండి.. ఆ తర్వాత బాధ్యతలు, సర్వీస్ నిబంధనలు తెలుస్తాయి' అంటూ ఉన్నతాధికారులు చెప్తున్నారట. అసలు తమ పని ఏమిటో తెలియకుండా ఎందుకు వెళ్లాలని పాత వీఆర్వోలు, వీఆర్ఏలు భావిస్తున్నారు. పైగా గతంలో కన్నా అధికారాలు తక్కువగా ఉండటం కూడా మరో కారణంగా చెప్తున్నారు. విద్యార్హతలు వంటి సాంకేతిక అడ్డంకులు ఉండటంతో సర్వేయర్ పోస్టులో చేరేందుకు వెనుకంజ వేస్తున్నట్టు సమాచారం.



అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యులు, అధికారులు

## జోగుళాంబ సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి

అలంపూర్, డిసెంబర్ 27 : అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తి పీఠమైన అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం సుప్రీంకోర్టు జడ్జి ఎస్‌వీఎన్ భట్టి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈవో పురేందర్‌కుమార్ స్వాగతం పలికి, జోగుళాంబ జ్ఞాపికను అందజేశారు. వారి వెంట గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్సై వెంకటస్వామి, తాసీల్దార్ మంజుల ఉన్నారు.

## ఈ ఏడాది 41 రోజులు భారీ ఎండలు

వాషింగ్టన్, డిసెంబర్ 27: ఈ ఏడాది ఎండలు మండిపోయాయని.. వాతావరణ మార్పుల వల్ల సగటున 41 రోజులు అదనంగా ఎండలను భరించాల్సి వచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు. మానవ కార్యకలాపాల వల్ల పెరుగుతున్న వాతావరణ మార్పులపై పరిశోధన చేసిన సైంటిస్టులు గత అధ్యయనాల ఆధారంగా ఈ విషయాలను వెల్లడించారు. 'ఈ పరిణామం ఆశ్చర్యం కలిగించకపోయినా ఆందోళనకరం. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ప్రజల జీవితాలు, జీవనోపాధులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి' అని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ అండ్ యాన్ ఇంపీరియల్ కాలేజ్ వాతావరణ శాస్త్రవేత్త ఫ్రెడరిక్ ఒట్టో అన్నారు.

## చోరీ కేసులో మరో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డి

సారంగాపూర్, డిసెంబర్ 27: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కాసం ఈశ్వరయ్య దంపతులపై ఈనెల 14న దొంగలు దాడి చేసి, ఇంట్లో భద్రపరిచిన బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలించగా ఈనెల 20న తుమ్మనాల గుట్ట వద్ద హోటల్‌లో ఉన్న ఆరుగురు నిందితులను పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న మంచిర్యాలకు చెందిన ముకునూరి కిరణ్‌కుమార్ శుక్రవారం జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఎదుట లొంగిపోయాడు. నిందితుడి వద్ద నుంచి బంగారు పుస్తెలు, మాటీలు, బుట్టాలు, వెండి కాళ్ల పట్టిలు, నేరం చేయడానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. చోరీకి గురైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీర్‌పూర్ ఎస్ఐ కుమార స్వామి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మా టీచర్లు మాకే కావాలి

- జగిత్యాల జిల్లా కుమ్మరిపల్లిలో కేజీబీవీ విద్యార్థుల ఆందోళన

వెల్గటూర్, డిసెంబర్ 27 : 'మా టీచర్లు మాకే కావాలి' అంటూ జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) విద్యార్థులు శుక్రవారం పాఠశాల గేటు ఎదుట ఆందోళనకు దిగారు. సమగ్ర శిక్ష ద్వారా పని చేస్తున్న కేజీబీవీ సిబ్బంది తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ 18 రోజులుగా సమ్మె నిర్వహిస్తుండడంతో జిల్లా విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలోని పలువురు మహిళా ఉపాధ్యాయులకు కేజీబీవీలో విధులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఇన్‌చార్జి ప్రత్యేకాధికారిగా గొడిసెలపేట బీసీకాలనీలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సుశీలను నియమించారు. ఆమె శుక్రవారం పాఠశాలకు వెళ్లగా విద్యార్థులు ఒక్కసారిగా నిరసనకు దిగారు. పాఠశాల ఆవరణలో బైఠాయించి తమ టీచర్లు తమకే కావాలంటూ పెద్దఎత్తున నినదించారు. పాఠశాల లోపలికి రాకుండా ఆమెను అడ్డుకున్నారు. దీంతో చేసేదేమీ లేక సుశీల వెనుతిరిగి వెళ్లారు. ఈ విషయాన్ని ప్రత్యేకాధికారి దీప, మండల విద్యాధికారి ప్రభాకర్‌కు సమాచారం ఇవ్వగా, వారు జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్ళారు. డీఈవో రాము పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసి పరిస్థితిని సమీక్షించి వెళ్లారు.

## గడ్డివాము దగ్ధం

వీణవంక, డిసెంబర్ 27: మండల కేంద్రానికి చెందిన రైతు బత్తిని నరేశ్ గడ్డివాము దగ్ధం కాగా, సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లింది. బాధితుడి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బత్తిని నరేశ్ పశువుల మేత కోసం 160 గడ్డి కట్టలు ఇంటి ఆవరణలో కుప్పగా ఉంచాడు. శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు అంటించగా, పెద్ద ఎత్తున మంటలు లేచాయి. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకునే సరికి గడ్డివాము పూర్తిగా కాలిపోయిందని, సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లినట్లు నరేశ్ పేర్కొన్నారు.

## వాసవి క్లబ్ కార్యవర్గం

ధర్మారం ,డిసెంబర్ 27: 2025 సంవత్సరానికి గానూ ధర్మారం మండల వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం సత్యనారాయణ శుక్రవారం ధర్మారం మండల కేంద్రంలో ప్రకటించారు. క్లబ్ అధ్యక్షుడిగా మల్యాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శ్రీనివాస్, కోశాధికారిగా గుంత సతీశ్‌లను నియమించినట్లు వెల్లడించారు. కాగా, క్లబ్ ఇం టర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ క్లబ్ నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తాటిపల్లి వంశీకృష్ణ ,మల్యాల శివ ఈగం ప్రసాద్,ఎలగందుల అశోక్, బీరెల్లి రామ్మోహన్ , కొల్లూరి కిషోర్ పాల్గొన్నారు.

## అడ్రియాల గనికి బంగారు భవిష్యత్

- కోలిండియా సాంకేతిక సలహాదారు డాక్టర్ వీరారెడ్డి



రామగిరి : డాక్టర్ వీరారెడ్డిని సన్మానిస్తున్న జీఎంలు

రామగిరి, డిసెంబర్ 27: సింగరేణి ఏపీఏ ఏరియా అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు బంగారు భవిష్యత్ ఉందని కోలిండియా సాంకేతిక సలహాదారు డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అడ్రియాల గనిని సందర్శించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన డాక్టర్ వీరారెడ్డి సింగరేణిలో సుదీర్ఘకాలం పని చేసి కోలిండియా సంస్థ టెక్నికల్ డైరెక్టర్‌గా పని చేసి గత ఆగస్టులో ఉద్యోగ విరమణ పొందారు. బొగ్గు గనులపై అపార అనుభవం కలిగిన వీరారెడ్డి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గత నెలలో టెక్నికల్ అడ్వయిజర్‌గా నియమించింది. ఈ క్రమంలో అడ్రియాల గని నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన ఆయన శుక్రవారం ఈ ప్రాంతంలో పర్యటించారు. ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కొలిపాక నాగేశ్వరరావు, ఇంజనీర్ యాదయ్య, ఎస్‌వోటూ జీఎం రఘుపతి మేనేజర్ జనార్దన్, ఇంజినీర్ రఘురాం, సీనియర్ పీవో రవిచంద్ర ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గనికి ఎంతో భవిష్యత్ ఉందన్నారు. ఓసీపీలలో బొగ్గు ఉత్పత్తి తగ్గుతున్న దృష్ట్యా భూగర్భ గనులపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 600 మీటర్ల లోతు నుంచి 800 మీటర్ల లోతులో ఉన్న బొగ్గు తీయాలంటే ఎన్నో లాంగ్‌వాల్ గనులు అవసరమన్నారు. ఈ గనిలో నాలుగు సీమ్‌లు, 12 ప్యానల్స్ ఉన్నాయనీ, సుమారు 555 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం అత్యధిక లాంగ్‌వాల్ టెక్నాలజీ ద్వారా బొగ్గు తీస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో రోడ్డు హెడర్స్ కంటిన్యూస్ మైనర్స్ లాంటి యంత్రాలు ఈ గనిలో ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఉద్యోగులకు శ్రమను తగ్గించే ఉద్దేశంతో మ్యాన్ వైండింగ్ ఏయిర్ షాఫ్ట్‌ను నిర్మించబోతున్నారన్నారు. అనంతరం ఆయనను జీఎం వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు సన్మానించారు.

### వీరారెడ్డికి ఘన సన్మానం

గోదావరిఖని, డిసెంబర్ 27: కోలిండియా సాంకేతిక సలహాదారు డాక్టర్ వీరారెడ్డి శుక్రవారం రామగుండంకు వచ్చారు. స్థానిక ఇల్లందు క్లబ్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో రామగుండం రీజియన్ జీఎంలు, భూపాల్‌పల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, జీఎంలు వారి సతీమణులు వీరారెడ్డిని సన్మానించారు. తెలంగాణ బిడ్డగా తన విధుల్లో క్రమ శిక్షణ, స్నేహపూర్వకగా మన్ననలను పొందిన అధికారి సేవలను కొనియాడారు. సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్జీ-1 జీఎం సేఫ్టీ గుప్తా, జీఎం క్వాలిటీ బైదయ, రామగుండం రీజియన్ 1,2,3ఎ, ఎల్‌పీ జనరల్ మేనేజర్లు సుధాకర్, సూర్యానారాయణ, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, దేవేందర్, సుశాంత్, రాజ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్ పాల్గొన్నారు.




టీబీకేఎస్ కార్యాలయంలో ప్రహరీ కూల్చుతున్నజేసీబీ

## టీబీజీకేఎస్ ఆఫీస్ ప్రహరీ కూల్చివేత

- నిరసన వ్యక్తం చేసిన టీబీజేకేఎస్ నేతల అరెస్ట్

గోదావరిఖని, డిసెంబర్ 27: పట్టణంలోని టీబీజీకేఎస్ కార్యాలయానికి చెందిన కమాన్, ప్రహరీని సింగరేణి ఆర్జీ-1 ఎస్అండ్‌పీసీ సిబ్బంది శుక్రవారం కూల్చి వేశారు. దీంతో టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపా ధ్యక్షుడు వడ్డేపల్లి రాంచందర్, నాయకుడు చిలుకూరి సతీశ్ అడ్డుగా బైఠాయించి నిరసన తెలిపారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ నాయకులు మాట్లాడారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్రమంగా కార్యాలయం కమాన్, గోడ ను కూల్చివేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ముందస్తు సమాచారం ఇస్తే తాము సహకారం అందించేవారమని, ఇలా నిరంకుశంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అభివృద్ధి పేరిట విధ్వంసం చేయడం అధికారులకు తగదన్నారు. ఇప్పటికే ఉపాధి కోల్పోయి రోడ్డున పడిన బాధితులకు పునరావాసం కల్పించి అభివృద్ధిలో ముం దుకు సాగాలని వారు హితవు పలికారు.

## టీబీ రహిత సమాజ నిర్మాణానికి కృషి

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 27: క్షయ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని క్షయ ప్రోగారమం పర్యవేక్షకుడు దేవ తిరుపతి అన్నారు. రాఘువాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో కొత్తపల్లిలో శుక్రవారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ర్యాలీ తీశారు. నిక్షయ్ శిబిర్ 100 రోజుల పథకంలో భాగంగా క్షయ శిబిరం నిర్వహించారు. వ్యాధిగ్రస్తుల్లో స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డీపీపీఎం కే ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీహర్ష , హెచ్ ఈవో సాంబయ్య, తిరుపతమ్మ, ఏఎన్ఎం సరోజ, ఆశా వర్కర్లు సరోజ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

ఓదెల, డిసెంబర్ 27: గుంపుల గ్రామంలో పొత్కపల్లి ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఇటీవల నూతనంగా ఎస్ఐగా బాధ్యతలను చేపట్టిన రమేశ్ వాహనాల తనిఖీ ద్వారా రోడ్డు భద్రతల గురించి ప్రజలకు తెలియజేస్తున్నారు. మద్యం తాగి వాహనాలను నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

## దుప్పట్ల పంపిణీ




చొప్పదండి జామమసీద్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దారుల్ ఖైర్ సొసైటీ సభ్యులు

చొప్పదండి, డిసెంబర్ 27: మున్సిపాలిటీ పరిధిలోని జామా మసీద్‌లో దారుల్ ఖైర్ సొసైటీ చైర్మన్ డా. ఖుద్దుస్, ముస్లిం మైనారిటీ మండల, పట్టణ అధ్యక్షుడు, మాజీ కోఆప్షన్ మెంబర్ జహిరొద్దీన్, జామా మసీద్ అధ్యక్షుడు అబిద్ అలీ ఆధ్వర్యంలో కుల మతాలకు అతీతంగా నిరుపేద మహిళలు, వృద్ధులు, పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దారుల్ ఖైర్ సొసైటీ చైర్మన్ డా. ఖుద్దుస్ మాట్లాడుతూ, ప్రతి ముస్లిం తన సంవత్సర ఆదాయంలో 2.5 శాతం అల్లాహ్ మార్గంలో అవసరమున్న వారికి, పేదవారికి సాయం చేయాలన్నారు. అలా కొంతమంది ముస్లింల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎం చర్చి పాస్టర్ హనోక్, శివాలయం పంతులు జనగామ సత్యనారాయణ, బొడిగే వెంకన్న, దారుల్ ఖైర్ సొసైటీ సభ్యులు హాఫిజ్ రిజ్వాన్ సాబ్, నజీబ్ అహ్మద్, అహ్మద్ అల్ జైది, జమాల్, అజీమ్ ఖాన్ గౌసొద్దీన్, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ సమీనా సుల్తానా ఖాజా అలీ, మసీద్ ఇమామ్ సాజిద్ అలీ, షాబీర్, అసిఫ్, యాసీన్ ఖాన్, తిరుపతి రెడ్డి, జహంగీర్, మహిళలు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## పాత బావి పూడ్చివేత

**నమస్తే కథనానికి స్పందన**



పాత బావిని మట్టితో పూడ్చుతున్న ఎక్స్‌కవేటర్

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 27: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో నెలకొన్న లోపాలపై ఈనెల 20న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'పాముల సంచారానికి ప్రధాన ద్వారాలివిగో' కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఈనెల 21న ప్రహరీ పిల్లర్ల మధ్య ఉన్న గ్యాప్‌లను సిమెంటుతో మూసివేయించిన విషయం తెలిసిందే. రెండు రోజులుగా సమీప ప్రాంతం నుంచి మట్టిని తీసుకొచ్చి పాడుబడిన బావిని పూడ్చివేయించారు.

## భర్త కాపురానికి రానివ్వడం లేదని భార్య ఆందోళన

ఎలిగేడు,డిసెంబర్ 27 : తన భర్త కాపురానికి రానివ్వడం లేదం టూ ఓ మహిళ ఆందోళనకు దిగిం ది. శుక్రవారం భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. ఈ ఘటన ఎలిగేడులో చోటు చేసుకుంది. బాధితురాలు సౌజన్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గుర్రం దేవేందర్‌కు కన్నాల గ్రామానికి చెందిన నాగుల సౌజన్యతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. అయితే దేవేందర్‌కు అప్పటికే పెళ్లైందని, మొదటి భార్యతో కోర్టులో కేసు నడుస్తుందని వివాహమైన తర్వాత తనకు ఈ విషయం తెలిసిందని సౌజన్య వాపోయింది. తన తల్లితో సహ మద్దతుగా పలువురితో భర్త దేవేందర్ ఇంటి ముందు బైఠాయించింది. తనకు న్యాయం జరిగే దాకా భర్త ఇంటి ముందు బైఠాయింపు కొనసాగుతుందని సౌజన్య పేర్కొంది. కాగా, జూలపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సౌజన్య కౌన్సెలింగ్ చేశారు. అయినా ఆందోళన విరమించలేదు.